# ఇంటివాడయిన వంటకాడు

" ఒక ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో లెక్చర్‌గా పనిచేస్తున్న 30 ఏళ్ళు, 20 వేలు జీతం, ఎట్టి బాధ్యతలూ లేని యువతికి వరుడు కావలెను. వరుడు తప్పక వంటొచ్చిన వాడై ఉండవలెను. ఉద్యోగం చేయవలసిన అవసరం లేదు. తనే ఇంటి బాధ్యతలూ, వంటబాధ్యతలూ చూడవలెను. దీనికి సమ్మతించిన వరులు తమ ఫోటో మయోడేటా బాక్స్ నంబర్ 5555 కి పంపవలెను.

"ఇటువంటి పత్రికా ప్రకటన ఎప్పుడు ఎవరూ చూడలేదు. ఇదేదో కొత్తగా ఉందే! " అనుకున్నారు. నిరుద్యోగ పట్టభద్రులు కొందరు.

"పెళ్లికంటె ఒప్పుకుంటాం కాని,మొగాడు వంట చేయడమేమిటయ్యా సిగ్గుచేటు! " అన్నాడొక నిరుద్యోగి.

"వంట చేయవల్సిన ఖర్మ నాకేం పట్టలేదు. కావలిస్తే ఆవిడ ఇంట్లోకి రాని మూడురోజుల్లోనూ వంట చేయొచ్చు గాని,ముప్పయిరోజులూ వంటెవడు చేస్తాడయ్యా ! సిగ్గు సిగ్గు! " అన్నాడింతో నిరుద్యోగి

" ఆ మూడు రోజులు మాత్రం వంటెందుకు చెయ్యాలి.హోటల్‌నుంచి క్యారేజ్ తెప్పించుకోవచ్చుకదా! " అన్నాడింకొకడు.

"బతికేనురా బాబు నా కష్టాలు గట్టెక్కాయి. వర్కింగ్ విమెన్స్ హాస్టల్ ముప్పయ్‌మందికి వంట చేసేబదులు,ఒకే ఒక్క వ్యక్తికి వంట చేసి పెట్టడం ఎంతో సులభం! " అని అనుకుని వ్యోమకేశం అనే 35 ఏళ్ల వంటవాడు ఫోటోతో సహా ఓ దరఖాస్తు పడేశాడు. ఓ పదిరోజులు పోయాక ఇంటర్వ్యూకి రమ్మని ఆహ్వానం వచ్చింది వ్యోమాకేశానికి. వ్యోమకేశం ఎవరింటికి వెళ్లాడో ఆ ఇంటి ముందు శైవలిని ఇంగ్లీషు లెక్చరర్ ' అని బోర్డు చూశాడు. బెల్లు కొట్టగానే "కమిన్! " అన్నది శైవలిని ..

"నమస్కారం నాపేరు వ్యోమకేశం.మీ పిలుపు అందుకొని వచ్చాను! " అన్నాడు.

వంటవాళ్లలో ఇంత అందగాడుంటాడా?! అని చోద్యపడుతూ చూసి అప్రయత్నంగా లేచి నిలబడి ప్రతి నమస్కారం చేసింది. శైవలిని.

"ఎక్కడమీరు వంట చేస్తున్నారు?"

వర్కింగ్ విమెన్స్ హాస్టల్లో!

"రోజుకి ఎంత మందికి వంట చేస్తున్నారు? "ముప్ఫయి మందికి!" "నాకు వంటగాడిగానూ, భర్తగానూ రావడానికి ఎందుకు సిద్దపడ్డారు?" "అక్కడ ముప్ఫయి మందికి వంట చేయడం వల్ల "నాకు చదువుకుందికి తీరుబాటు లేకుండా పోతోంది. నేను డిగ్రీ పూర్తిచేశాను. ఎం.ఎ చేద్దామనే అభిలాష పూర్తికావడం లేదు. మీ ఇంట్లో అయితే మనిద్దరికే కదా వంట చేయడం అని అభిప్రాయపడ్డాను. మీకు క్యారేజ్ సర్దేసి మీరు కాలేజికి వెళ్లాక నాకు చదువుకుందికి వ్యవధి దొరుకుతుందని, క్షమించాలి అప్పుడే ' మనం ' అనేస్తున్నాను! "అన్నాడు వ్యోమకేశం.

సరే ఓవారం రోజుల్లో మీకు ఏ విషయం తెలియజేస్తాను.మీరు వెళ్లవచ్చు నమస్కారం అంది శైవలిని. వ్యోమకేశం ప్రతి నమస్కారం చేసి వెళ్లిపోయాడు.

ఈలోగా శైవలిని వర్కింగ్ విమెన్స్ హాస్టల్ కెళ్ళి అక్కడి ఇన్‌మేట్స్‌ని, తదితర సిబ్బందిని వ్యోమకేశం గురించి భోగట్టా చేసింది అందరూ అతనికి క్లీన్ సర్టిఫికేట్ ఇచ్చేశారు. అలాగే వ్యోమకేశం కూడా శైవలిని పనిచేస్తున్న డిగ్రీ కాలేజికి వెళ్లి ఆమెను గురించి భోగట్టా చేశాడు. శైవలిని చాలా ఉత్తమురాలని ఆ ప్రిన్సిపాల్ ఐ.ఎస్.ఐ. ముద్రవేసింది. నెల రోజులు పోయాక శైవలిని,వ్యోమకేశం ఒకరి శరీరాలనొకరు ఆక్రమించుకున్నారు.

ఎప్పుడు పెలవులొచ్చిన ఇద్దరూ స్టార్ హోటల్ కెళ్ళి భోజనాలు చేసి, సినిమాలు చూసుకొని కిలకిల నవ్వుకుంటూ ఇంటికి వస్తున్నారు. శైవలినికి, వ్యోమకేశం భర్తకాక ముందు వంట వాడిగా ఉండాలని కోరుకుంది గాని,తనకు భర్త అయిందగ్గర్నుంచీ తనుకూడా భర్తకు వంటలో సహకరించడం,అంటే కూరలు తరగడం, ప్రెషర్‌కుక్కర్‌లో అన్నమూ , పప్పూ సర్దేసి స్టౌకెక్కించడం చేస్తూనే ఉంది. ఎంత వంటవాడయినా తనకు భర్తే కదా! అనాది సంప్రదాయాలు ఒకపట్టాన పోవుగా!

రాత్రి పడుకోబోయేముందు శైవలిని భర్తకి ఇంగ్లీషు పాఠాలు చెబుతూ ,తన భర్త ఎం ఏ పూర్తి చేయడానికి ఎంతగానో దోహదం చేస్తోంది.

ఏ పురుష పుంగవుడైనా భార్య తనకంటె అధికురాలు కాకూడదని, అణగ దొక్కడానికే చూస్తాడు. అదే పురుషునికి, స్త్రీ కి ఉన్న వ్యత్యాసం!

వ్యోమకేశం కూరల మార్కెట్‌కి వెడుతున్నప్పుడు నలుగురు మిత్రులు తోవలో అటకాయించి " ఏరా వ్యోమకేశం! నీకేమైనా బుద్దుందా నువ్వు నిజంగా మొగాడివేనా ? ఆడది వంటింట్లో వుండి పడుండాలి కాని, నువ్వు మొగాడివయ్యుండి వంట చేస్తావురా? నీకు సిగ్గు లేదు! మొగాడు వంట చేస్తున్నట్టు పత్రికల్లో ఏదో నవ్వుతెప్పించడానికి వేస్తున్నారనుకున్నాం కాని, నీలాంటి చచ్చుదద్దమ్మలు, చవట పీనుగులూ నిజంగానే ఉన్నారని ఇప్పుడు తెలిసింది.! ' అన్నారు ఏకగ్రీవంగా.

దానికి జవాబుగా వ్యోమకేశం ఒక లెక్చరర్‌కి మొగుడైనందుకు ఒక మినీ లెక్చర్ దంచాడు. " సిగ్గెందుకురా వెధవాయిల్లారా! ఆదినుంచి ఆడది వంట చేస్తూ భర్తనీ పిల్లల్నీ సాకుతూ సంసారం చక్కదిద్దుకోవడం చేస్తూనే ఉంది నిజమే,ఒప్పుకున్నాను.కాని అప్పటికీ ఇప్పటికీ కాలమాన పరిస్థితుల్లో ఎంతో మార్పు వచ్చింది ఆనాడు ఆడది ఉద్యోగం చేయడం ఎరగదు అప్పుడు అవసరం కలగలేదు. ఇప్పటి అవసరాలు వేరు. ఈనాడు ఆడది తన కాళ్లమీద తాను నిలబడే పరిస్థితులేర్పడ్డాయి. ఆనాడు ఆడది ఉద్యోగాలు చేయాలా ఊళ్లే లాలా అనేవారు. ఇప్పుడు ఆడది ఉద్యోగం చేస్తోంది ఊళ్లూ ఏలుతోంది. వేల కోలదీ సంవత్సరాల పాటు ఆడది వంట చేసుకుంటూ భర్తనీ సంసారాన్నీ చూసుకుంటుంటే ఇవాళ మొగాడు వంట చేసి ఆడదానికి సహకరించవద్దా? ఫిఫ్టీ ఫిఫ్టీ అంటారే! మరి మొత్తం ఆడదే సంసారాన్ని చక్కదిద్దుకుంటుంటే ఫిఫ్టీ ఫిఫ్టీ ఎలా అయింది? సెంట్‌పెర్సెంట్ అవలేదా? భార్యగా,తల్లిగా ,అత్తగా, అమ్మమ్మగా,నాయనమ్మగా వివిధ పాత్రలు పోషిస్తోందే! ఎన్నాళ్ళు మొగాడు వంట చేస్తే ఆడదాని రుణం తీరుతుంది? స్త్రీ లేకపోతే సృష్టికార్యం ఎలా జరుగుతుంది? ఇంతకీ వంట అన్నది మొగాడే చేయాలి నలభీమ పాకం అంటారు. నలుడూ భీముడూ మొగాళ్లే నా! ఆడది గొప్ప వంటకత్తె అని పురాణాల్లోఎక్కడుందో చూపించండి!. వ్యోమకేశం ఇచ్చిన ఈ సమాధానాలకి మిత్రులు నలుగురూ దిమ్మదిరిగిపోయి బి.పి. మాత్రలు కొనుక్కుందికి పరుగెత్తారు.

2-6-2002

**ఆదివారం ఆంధ్రప్రభ**